క్లుప్తంగా

చర్య తీసుకోవాలి



మంగపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని మన్య సీమ పరిరక్షణ సమితి డొలు దెబ్బ మండల అధ్యక్షుడు తాటి నాగరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయం ఎదుట ఆదివాసీ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రం పరిధిలోని పాద్మూర్ రెవెన్యూ గ్రామంలోని కోమటిపల్లి క్రాస్‌రోడ్డు చెరువు కట్ట సర్వేనంబర్ 87లోగల 1.26 గుంటలు, 107/01లో మరో ఎకరం ప్రభుత్వ భూమిలో గతంలో ఆదివాసీ గిరిజనులు నివాసం ఉన్నార న్నారు. ఆ భూమిని కొందరు గిరిజనేతరులు అక్రమ పట్టాల పేరుతో కమర్షియల్ ప్లాట్లుగా చేసి లక్షల రూపాయలకు అమ్ముకుంటు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో మన్య సీమ పరిరక్షణ సమితి నాయకులు పూనెం రాములు, తోలెం నర్సింహారావు, అన్నెబోయిన సమ్మయ్య, తోలెం సుధాకర్, జబ్బ నరేష్ పాల్గొన్నారు.

26న పుష్కరాల ముగింపు కార్యక్రమాలు

కాళేశ్వరం: రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న సరస్వతినది పుష్కరాలు 26తో ముగియనున్నాయి. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమాలను సాయంత్రం 6గంటలకు సరస్వతిఘాటు వద్ద కాళేశ్వరాలయం నుంచి తరలివస్తారు. సాయంత్రం 6.05 గంటలకు దేవాదాయశాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ శైలజారామయ్యార్ మాట్లాడుతారు. 6.10గంటలకు పుష్కరాలపై నాగఫణిశర్మ ప్రవచిస్తారు. 6.30 గంటలకు పుష్కరాలపై మంత్రులు, వీఐపీలు మాట్లాడుతారు. రాత్రి 7గంటలకు సరస్వతినదికి నవరత్నమాల హారతిని ఇస్తారు.7.45గంటలకు డ్రోన్‌తో షో నిర్వహిస్తారు. 7.55గంటల నుంచి 8.10గంటల వరకు క్రాకర్స్‌తో సంబురాలు ముగింపు సంబురాలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పరిహారం అందజేత



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన నిట్టూరి శంకరయ్యకు చెందిన ఎద్దును రెండు నెలల కిందట పులిదాడి చంపింది. దీంతో శుక్రవారం సీసీఎఫ్ డాక్టర్ ప్రభాకర్, డీఎఫ్ఓ నవీన్‌రెడ్డిల చేతుల మీదుగా రూ.40వేల పరిహారం రైతుకు అందజేశారు. రేంజర్ రవి, ఎఫ్ఎస్ఓ తిరుపతి ఉన్నారు.

కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు బూర్గు రవి ఆదేశాలతో (టీఎన్‌జీఓవీఏ) వెటర్నరీ ఫోరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి దశరథ రామారావు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసి న కార్యక్రమంలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. వెటర్నరీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బింగి సురేష్ టీఎన్‌జీఓ రాష్ట్ర కార్యదర్శి పోరెడ్డి అభిషేక్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అజీమ్ పాషా, హన్మకొండ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

సింగరేణి ఎంసీ క్వార్టర్స్‌లో చోరీ



భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్ సింగరేణి ఏరియా ఆస్పత్రి వెనుక భాగంలోని ఉన్న రెండు ఎంసీ క్వార్టర్స్‌లో గుర్తుతెలియని దొంగలు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 3వగనిలో ఫోర్ మెన్ పనిచేస్తున్న సంపత్ రెడ్డి రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. అదేవిధంగా అదేప్రాంతంలో కెటీకె 5వగనిలో మైనింగ్ సర్దార్ గా పనిచేస్తున్న శంకర్ పనుల నిమిత్తం సొంత గ్రామం వెళ్లారు. వారి ఇళ్లకు వేసిన తాళాలను గుర్తుతెలియని దొంగలు ధ్వంసం చేసి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. రెండు ఇళ్లలో చోరీ జరిగిన విషయాన్ని ఇంటి పక్క వారు సంపత్ రెడ్డికి, శంకర్‌కు, పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఎంత విలువైన ఆభరణాలు నగదు డబ్బులు ఎంత మేరకు చోరీ చేశారనేది పూర్తిగా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

ఇసుక లారీలతో తిప్పలు



అబ్బాయిగూడెం నుంచి ఆలుబాక వరకు నిలిచిపోయిన లారీలు



పాత్రాపురం గ్రామ సమీపంలో ట్రాఫిక్‌లో 108 వాహనం

- మండలంలో నిత్యం ట్రాఫిక్ జామ్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వెంకటాపురం(కె): మండల ప్రజలు ప్రతీ రోజు ఇసుక లారీలతో ఇబ్బందులు పడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వచ్చే ఇసుక లారీలతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. కాగా శుక్రవారం మండల పరిధిలోని ఆలుబాక గ్రామం నుంచి అబ్బాయిగూడెం గ్రామం వరకు సుమారు ఐదు కిలో మీటర్లు ఇసుక లారీలు రోడ్డుకు ఇరువైపులా రావడంతో గంటకు పైగా ట్రాఫిక్ అంతరాయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే పాత్రాపురం గ్రామ సమీపంలో ఇసుక లారీలతో రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ఎదిరకు సంబంధించిన 108 అంబులెన్స్ వాహనం సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రోజు ఇసుక లారీలతో మండలంలో ఎక్కడో ఒక దగ్గర ట్రాఫిక్ అంతరాయం కలుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత



ఏటూరునాగారం: ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్



గోవిందరావుపేట: మాట్లాడుతున్న పస్రా సీఐ

- సీఐ అనుముల శ్రీనివాస్

ఏటూరునాగారం: డ్రగ్స్‌ను నిర్మూలించడం అందరి బాధ్యత అని సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఎంఈఓ కొయ్యడ మల్లయ్య అధ్యక్షతన ఉపాధ్యాయులకు డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచి విద్య అభ్యాసంతో పాటు డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలన్నారు. యువత డ్రగ్స్‌కు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని వారు ఏ విధంగా బానిసలవుతున్నారో డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా ఉపాధ్యాయులకు వివరించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులు, యువత భవిష్యత్ దృష్ట్యా డ్రగ్స్‌ను తరిమికొట్టే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకు అవగాహన పెంపొందించాలి

గోవిందరావుపేట: పాఠశాల స్థాయి నుంచి విద్యాభ్యాసంతో పాటు డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలని పస్రా సీఐ రవీందర్ అన్నారు. మండల పరిధిలోని చల్వాయి ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ రవీందర్ హాజరై మాట్లాడారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడంలో భాగస్వాములు అవుతూ యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని డ్రగ్స్‌పై తరగతి గదిలో అవగాహన కల్పించే విధంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులందరితో డ్రగ్స్‌ను తరిమి కొడదాం, డ్రగ్స్ బారిన పడకుండా పిల్లలని కాపాడుతాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలను తరలించాలి



బస్తాల్లోని ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జీసీసీ గోదాంల వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు వద్ద నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే తరలించాలని రైతులు కొండాయి రాజు, రామారావు, దుర్గం చంద్రయ్య అధికారులను కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ధాన్యం బస్తాలు తడిసినవని కోతలు విధిస్తున్నారన్నారు. క్వింటాకు 15 కిలోలు కోత విధిస్తామని చెబితే నిరాకరించినందుకు బస్తాలను తరలించడం లేదని వాపోయారు. కొనుగోలు కేంద్రంలో దాదాపు 980 బస్తాలు నిల్వ ఉన్నాయని తెలిపారు.

మైసమ్మ జాతరకు ఏర్పాట్లు

వాజేడు: మండల పరిధిలోని కాచారం వద్ద శనివారం నుంచి మైసమ్మ జాతరను నిర్వహించనున్నారు. జాతర నిర్వహణకు మైసమ్మ తల్లి ఆలయం వద్ద ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం ఏర్పాట్లు చేశారు. తల్లడి పాపారావు, జెజ్జరి మదనయ్య ఆధ్వర్యంలో చలువాకు పందిళ్లను వేయడంతో పాటు మామిడాకులతో తోరణాలను కట్టారు. మొదటి రోజు పావన గోదావరి నుంచి పారేటి కుండల్లో గంగ జలాలను తీసుకువచ్చి మైసమ్మ తల్లికి జలాభిషేకం చేయనుండగా ఆదివారం నుంచి భక్తులు మొక్కులను సమర్పించుకోనున్నారు.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దు



గొత్తికోయలతో సీఐ దారం సురేష్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు

- సీఐ దారం సురేష్

ములుగు రూరల్: అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని సీఐ దారం సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గన్నగూడెం శివారులోని బోడరామయ్యగడ్డ గొత్తికోయ గూడెంలో కార్డన్ సర్చ్ నిర్వహించారు. అనంతరం రెడ్ క్రాస్ సంస్థ వారి సహకారంతో గుత్తికోయలకు వర్షాకాలంలో అవసరమైయ్యే టార్పాలిన్‌లు, దుప్పట్లు, వంట సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సంఘ విద్రోహశక్తులకు సహకరించకూడదని, ఎవరైన తెలియని వ్యక్తులు గూడెంలోకి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకూడదని, బడీడు పిల్లలను తప్పకుండా బడికి పంపించాలని అన్నారు. గుత్తికోయలకు సరుకుల పంపిణీకి సహకరించిన రెడ్ క్రాస్ చైర్మన్ అల్లెం అప్పయ్య, గంగిశెట్టి శ్రీనివాస్, రమేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, టీజీఎస్పీ, సివిల్ ఫోర్స్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



టీమోపాస్ మందు చల్లుతున్న సిబ్బంది

వాజేడు: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేరూరు హెచ్ఈఓ పాయం వేణుగోపాల కృష్ణ అన్నారు. మండల పరిధిలోని టేకులగూడెం గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రవీందర్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. నిల్వ నీటిని తొలగించడంతో పాటు నీరు నిల్వ ఉన్న గుంతల్లో టీమోపాస్ మందుతో పాటు ఆయిల్ బాల్స్ వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఆశకార్యకర్తలు ఉన్నారు.

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల కోసం శుక్రవారం తాడ్వాయి నుంచి పస్రా వరకు మలుపుల వద్ద పోలీసులు హెచ్చరిక స్టికర్లు అటించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మలుపుల వద్ద వాహనదారులు అతివేగంగా వెళ్లకూడదన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను గమనించాలన్నారు. అలాగే మండల కేంద్రంలోని కామారం గ్రామపంచాయతీ పరిధిలోని గొత్తికోయ గూడెంలోని కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు. అనంతరం గూడెంలోని పిల్లలకు వాటర్ బాటిళ్లను, పాదరక్షలు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని ఎల్బాక, మేడారం,



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

తాడ్వాయి గ్రామాల్లో పీఎస్సై సతీష్ రోడ్డు భద్రత సమావేశాలు నిర్వహించారు. రోడ్డుపై వెళ్లే క్రమంలో వాహనదారులు పాటించాల్సిన రోడ్డు భద్రత నియమ నింబంధనలపై అవగాహన కల్పించారు. పడిగాపూర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటుపై అవగాహన కల్పించారు.

పులిహోర ప్యాకెట్ల పంపిణీ

కాటారం: సరస్వతి పుష్కరాలకు వెళ్తున్న భక్తులకు మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ తెప్పెల దేవేందర్‌రెడ్డి, తెప్పెల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పులిహోర ప్యాకేట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీపాదట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు సూచన మేరకు పుష్కరాలు పూర్తయ్యే వరకు భక్తులకు పులిహోర ప్యాకేట్లు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం సువిద్య పాఠశాల ఆధ్వర్యంలో కరస్పాండెంట్ కొట్టె శ్రీశైలం మండల కేంద్రంలో తాగు నీటి కేంద్రం ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, రమేశ్‌రెడ్డి, గద్దె సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమేశ్ మృతి ఉద్యమానికి తీరని లోటు

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నూడి కృష్ణారెడ్డి

గోవిందరావుపేట: సీపీఎం సీనియర్ నాయకుడు పోలోజు రమేశ్ మృతి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నూడి కృష్ణారెడ్డి అన్నారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మృతుడు రమేశ్ మృతదేహం వద్ద నాయకులు కృష్ణారెడ్డి, బీరెడ్డి సాంబశివ నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి సోమా మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాదిళ్ల చిట్టిబాబు, తీగల ఆగిరెడ్డి, గొంది రాజేష్, కడారి నాగరాజు, ఖ్యాతం సూర్యనారాయణ, గుండు రామస్వామి, పల్లపు రాజు, లెనిన్, సువర్ణ, సదానందం,



నివాళులర్పిస్తున్న నాయకులు

సాంబయ్య, ఐలయ్య, కృష్ణారావు, మురళి, ఉపేంద్ర చారి, కవిత, కోటేశ్వరరావు, జీవన్, గొర్ల శ్రీను, నగేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామ శివారులో నల్లబెల్లి సాంబయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో చేతికి అందే విధంగా 11కేవీ వైర్లు కిందికి ఉన్నాయని బాధిత రైతు తెలిపారు. సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని కూలీలు వ్యవసాయ పనులకు రావడానికి జంకుతున్నారన్నారు. అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను సరిచేయాలని రైతు వేడుకుంటున్నాడు.



విద్యుత్ వైర్లను చూపుతున్న రైతు

వాకీటాకీల వినియోగం



వాకీటాకీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

కాళేశ్వరం: సరస్వతి పుష్కరాల్లో లక్షలాది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో భద్రత, రవాణా, పారిశుద్ధ్యం వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులతో ఎప్పకప్పుడు సమన్వయం చేసేందుకు అధికారులు వాకీటాకీ సేవలు విస్తృతంగా వినియోగిస్తున్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి వాకీటాకీల ద్వారా అధికారులతో నేరుగా కమ్యూనికేషన్ ఏర్పాటు చేసి అక్కడ ఏర్పడే అత్యవసర పరిస్థితులను వెంటనే గుర్తించి, సత్వర పరిష్కార చర్యలు తీసుకుంటున్నారు. ఇలా పుష్కర ఘాట్లు, ట్రాఫిక్ నియంత్రణ ప్రాంతాలు, పార్కింగ్ జోన్లు, ఉచిత వాహన కేంద్రాలు పలు ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందికి వాకీ టాకీలు అందుబాటులో ఉంచి నిరంతరంగా సమాచారం , సూచనలు అందిస్తున్నారు.

కుప్పగా పోశారు.. వదిలేశారు



కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ సమీపంలో వర్షం కారణంగా నీరు నిల్వడంతో బురదమయంగా మారిపోయింది. దీంతో భక్తులు నడవడానికి ఇబ్బందిగా మారడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు పరిసర ప్రాంతాల్లో సిమెంట్, కంకర మిక్స్‌ను ఓ కుప్పగా పోశారు. బురద ఉన్న చోట ఆ మిక్స్‌ను చదును చేయకుండా అలానే వదిలేశారు.

స్టోర్ ఏర్పాటు



మల్హర్: పుష్కరాల నేపథ్యంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులు సామగ్రిని భద్రపరుచుకునే విధంగా ఉచిత ర్యాక్ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. కాళేశ్వర సరస్వతి నది ఘాట్ వద్ద భక్తులు పుష్కర స్నానం అచరించిన అనంతరం కాళేశ్వర ఆలయంలో దర్శనానికి వస్తున్నారు. ఈ క్రమంలో భక్తులు తమ సామగ్రిని భద్రపరచుకోవడానికి దేవదాయ శాఖ నిర్వాహకులు ఇనుప ర్యాక్‌ల స్టోర్‌లో భద్రపరుస్తున్నారు. అలాగే కొందరు ప్రైవేట్ వ్యక్తులు మాత్రం భక్తుల సామగ్రిని భద్రపేరుచుకోవడానికి రూ. 20 వసూల్ చేస్తున్నారు.

నిత్యాన్నదానం

మల్హర్: సరస్వతి పుష్కరాల్లో భాగంగా కాళేశ్వరం వచ్చే భక్తుల కోసం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సింగరేణి గెస్ట్‌హౌజ్ ఆవరణలో నిత్య అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. ఈ సత్రం ద్వారా ప్రతి రోజు 3వేల నుంచి 5వేల భక్తులకు ఉదయం టిఫెన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా సుమారు



ఎనిమిది అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. 12 రోజుల పాటు భక్తుల సౌకర్యార్థం ఉచిత అన్నదానం చేపడుతున్నట్లు భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వాహనాల లెక్క పక్కాగా..



కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి నది పుష్కరాలకు వస్తున్న భక్తుల వాహనాలను అధికారులు పక్కాగా లెక్కిస్తున్నారు. ప్రతీ రోజు పుష్కరాలకు ఎన్ని వాహనాలు వస్తున్నాయి. ఎన్ని వాహనాలు వెళ్తున్నాయని పోలీస్ సిబ్బంది నమోదు చేసుకుంటున్నారు. తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే దారిలో ప్రత్యేకంగా నియమించిన ఓ పోలీస్ సిబ్బంది వచ్చిపోయే వాహనాల వివరాలు నమోదు చేస్తున్నారు. దీంతో పుష్కరాల సమయంలో కాళేశ్వరం ఎన్ని వాహనాలు అనే వివరాలు స్పష్టంగా తెలియడం కోసం ఈ లెక్కింపు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తుల సేవలో పోలీసులు



చిట్యాల: కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాల్లో తొమ్మిదవ రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈక్రమంలో సరస్వతి ఘాట్ వద్ద నడవలేని స్థితిలో ఇబ్బంది పడ్డ ఓ వృద్ధురాలును పోలీసులు నదీతీరం నుంచి కుర్చీలో కూర్చోబెట్టి మోస్తూ మెట్లు ఎక్కించారు.

బస్సుల కోసం భక్తుల ఇక్కట్లు



పలిమెల: కాళేశ్వరంలోని సరస్వతి నది పుష్కరాలకు భారీగా వస్తున్న భక్తులకు తిరుగు ప్రయాణంలో బస్సులు సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు భక్తుల సౌకార్యార్థం బస్సులను ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



పలిమెల: ద్విచక్ర వాహనంపై సరస్వతి నది పుష్కరాలకు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి తిరుగు ప్రయాణంలో మంచిర్యాల జిల్లా నస్పూర్ కాలనీకి చెందిన వృద్ధ దంపతులకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ముందుగా వెళ్తున్న పోలీసు వాహనం హరితహోటల్ ముందు ఒక్కసారిగా యూటర్న్ తీసుకోవడంతో వెనకాలే ఉన్న ద్విచక్ర వాహనదారులు పోలీస్ వాహనానికి ఢీకొట్టారు. కాగా వారు స్వల్ప గాయాలతోనే బయటపడ్డారని తెలిపారు.

సహాయక చర్యల్లో సింగరేణి రెస్క్యూటీం



పలిమెల: సరస్వతి నది పుష్కరాల్లో సింగరేణి రెస్క్యూ టీం భక్తులకు సహాయక చర్యలు చేపడుతుంది. దీంట్లో భాగంగా హైదరాబాద్ నుంచి పుష్కరాలకు వచ్చిన సావిత్రి అనే మహిళ కళ్లు తిరిగి పడిపోగా సింగరేణి రెస్క్యూటీం సిబ్బంది మారెపల్లి బాబు, సంజీవ్, శ్రీనివాస్, వినీస్ సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.